# ఒకటే గమ్యం

- వేద ప్రభాస్

మనసు మబ్బవుతుంది. నల్లగా బరువుతో వేళ్ళాడుతూ ఆకాశమంతటినీ ఆవరించి పోయే పెనుమబ్బులా ఆవేదనేదో కమ్మేసుకున్నపుడు మనసు నల్లమబ్బే అయిపోతుంది. అల్లుకున్న మబ్బు ఉధృతంగా నీరై కురిసిపోయాక మబ్బు మాయమై పోయినట్టు, కళ్ళవెంట ధారలుగా కన్నీరు కారినప్పుడుగానీ ఆవేదన అంతమవదు. ఆ ఆవేదన దేనికోసమైనా కావొచ్చు.



భరించలేని ఆవేదన నల్ల మేఘంలాగా మన సంతా నిండిపోయినా ఆమెకి కన్నీరే రావటం లేదు. ఆమెలో భావోద్వేగాల బావి ఎన్నడో ఎండిపోయింది. ఎప్పుడూ ఈ మధ్య కాలంలో అవసరం పడకపోవడంతో కన్నీళ్ళు కూడా ఆమెలో బిడ్డ పాలు తాగడం మానేసాక ఇంకిపోయిన తల్లిపాలలాగా ఇగిరిపోయాయి. ఆమె ఇప్పుడు అనుభూతులన్నీ దగ్ధమైపోతున్నపుడు, కొద్దిపాటి కన్నీటికోసం తన మెదడులోని జ్ఞాపకాలను చాలా ఓపిగ్గా వెదుకుతోంది.

ఆమెకి చాలాకాలం కిందటి సంగతి ఒకటి జ్ఞాపకం వచ్చింది.

***

అప్పుడు ఉప్పెనొచ్చిన దాన్లా ఉంది ఊరు. పెద్ద తప్పు చేసిన దాన్లా ఉంది. ఊరి జనమంతా ఒక్కుమ్మడిగా ఊరు కాలిపోయిన వాళ్ళల్లా ఉన్నారు. ఏ ఇంటికీ కళ లేదు... ఏ ఇంటికీ గడపైనా మిగల్లేదు... తరాల పురుడు, పుణ్యాలు గడచిన గదులన్నీ నడిచిపోయిన జ్ఞాపకాలయి పోయేయి.

ఊర్ని కొట్టేరు. ఊరి రోడ్లు కొట్టేరు. దుకాణాలూ, దివాణాలూ ఏదీ వొదల్లేదు. అన్నీ కొట్టేరు.

ఊరు ఇరుకైంది. ఊరలా ఉంటే పనికిరాదట. ముసలిదైపోతే అమ్మ మరి పనికి రానట్టు. ఎవరూ ఏమనలేకపోయేరు. ఏమన్నా ఎవరూ వినేవాళ్లు కానపుడు ఎవరేమనీ లాభం లేదని అందరికీ తెలిసిపోయింది. ఇళ్లు మాట్లాడలేదు. ఊరివంక ఆశగా చూసేయి. ఊరు ఊరుకుండిపోయింది. ఊరు గుంభనంగా ఉండిపోయింది. అధికారులు ముత్యాలు నోటబెట్టుకున్నవాళ్ళయ్యేరు. ఆరాలకు అందకుండా తిరిగేరు. ఊళ్ళన్నీ వరసగా తెగిపోతున్నాయని తెలిసి, ఊరివాళ్ళకి ముందుగా నిద్ర తెగిపోయింది. ఊర్లో అందరూ ఉన్నారు. అయినా ఊరు కొట్టేరు.

పగలే...!

ఎలాంటి పగా లేదు. తాతలనాటి ఊరు... తరాలు అంతర్వాహినులైన ఊరు... ఉప్పెనొచ్చిన దాన్లా అయిపోయింది. గొప్ప తప్పు చేసి దొరికిపోయినట్లైపోయింది. వందలమంది వేలమందైనా గోవర్ధన గిరిలాగా కాచిన ఊరు. రెక్కలు తెగిపోయిన తల్లి కోడిలా అయిపోయింది. అప్పుడు ఊరందరిలో ఆవేదన నల్లమబ్బే అయ్యింది. కష్టాలు కన్నీళ్లై ఊరంతా ప్రవహించేయి. గమ్యం ఆగమ్య గోచరం అయిపోయింది. అమ్మకీ నాన్నకీ... అప్పుడే హాయిగా ఫీలయిన ఆమెకి ఆ జ్ఞాపకం ఇప్పుడేమీ కంటినీరు తెప్పించలేకపోయింది.

***

ఇప్పుడు ఆమె ఒక్కర్తే కూర్చుంది. ఘనీభవించిన శిలలాగా కూర్చుంది. తొమ్మిదంతస్థుల అపార్టుమెంట్‌లో నాలుగో అంతస్థు సగంపైగా ఆక్రమించుకున్న ఆ ప్లాట్లో విశాలంగా ఉన్న బెడ్రూంలో మూడోవంతు జాగాలో ఉన్న మంచం పక్కన ఆమె చలనం లేకుండా చాలా సేపట్నుండి అలానే కూర్చుంది. రాత్రికూడా నిలిచిపోయినట్టుంది. మరింక ముందుకు కదిలేట్టుగా లేదు. ఇంట్లో కూడా మరెవ్వరూ లేరు. ఎవరూ లేకుండా గడపటం, ఆమెకీ, అతనికీ బాగానే అలవాటైంది.



ఇప్పుడు వాళ్ళ జీవితం అర్థాన్ని కోల్పోయింది. చైతన్యం చచ్చిపోయింది. బతుకంటేనే చావుకోసం ఎదురు చూడటం అని నమ్మడం మొదలయ్యేక, ఆ ఇల్లు శీతాకాలం ఉదయం వేళ మంచుకు తడిసి నిశ్చలంగా ఉన్న సమాధిలా అయిపోయింది.

ఆమె చలువరాతి శిల్పంలాగా, మరికాస్సేపట్లో చనిపోయే అతని పక్కనే కూర్చుంది. అతన్లో చలనం లేదు. నిద్రలోనో మైకంలోనో ఉన్నట్టున్నాడు. పక్కటెముకల కదలిక బట్టి అతనింకా చనిపోలేదని తెలుస్తోంది. కిందకి జారి వేళ్ళాడుతున్నట్టున్న అతనికింది దవడ గుంటలు పడిపోయిన రెండు చెంపలు చర్మం మాత్రమే సాగదీసి అంటించినట్టున్న నుదురు., ఆమె కొంచెం పరిశీలనగా చూసింది. అనుభూతులేమీ లేకుండా అలా చూడగలగటం చాలా అలవాటయితేనే గానీ రాదు.

ఒక కాకి మరణ యాతనని గోడమీంచి మరో కాకి పరిశీలిస్తున్నట్టు ఉందామె చూపు. మంచం పక్కనే కుర్చీలో కూర్చుని ఆ కాళ రాత్రివేళ, చలనం లేకుండా వెల్లకిలా పడుకున్న అతని మొహం వైపే చూస్తున్న ఆమె కూడా కదలికలేమీలేని బొమ్మలానే ఉంది.

ఆమె మనసుమాత్రం అనుభూతులు మడతలు విప్పి జ్ఞాపకాల్ని సరిచూసుకుంటోంది. ఉద్వేగాల కోసం నిశితంగా వెతుక్కుంటోంది.

***

ఇద్దరూ కలిసి బతకటం ప్రారంభించిన కొత్తల్లో అతను ఒక ఉన్మీలన మెరుపు. ఒక సౌందర్య ప్రహేళిక. ఆమె సప్తవర్ణాల శోభిత చిత్రం. ఆ రోజుల్లో కలలు కావ్యాల్లా ఉండేవి. ఊహలు చాంపేయమాలలయ్యేవి. ధ్వనులు ఆనంద వర్ధనీయాలయ్యేవి. ఆమె పెదవులు అతనికి మధురాలైతే, అతని శ్మశ్రువులు ఆమెకి కిలికించి తాలయ్యేవి. అదంతా ప్రస్తుతం అసంగత గతం...!

ఆ జీవితం ఇప్పుడు కాలం కడుపులోకి జారిపోయిన కథ.

ఆమె కొంచెం ముందుకు వంగి అతని పెదాల మీద తన పెదవులనుంచింది. చల్లగా ఉన్న రబ్బరు ముక్కను తాకి నట్టుంది. అసలేం లేదక్కడ. అనుభూతికానీ, అనుభవం గానీ లేనేలేదు. అప్పుడెప్పుడో ఊహ తెలీనప్పుడు ఆడా మగా తేడాయే అసలు తేలీకుండా ఉన్నప్పుడు, ఇప్పుడు రూపు కూడా గుర్తులేని పొరుగింటి కాలేజీ కుర్రాడు దొంగతనంగా హత్తుకుని, తన చిన్ని పెదాలపై ముద్దు పెట్టినపుడు తనేఅనుభూతినీ పొందక పోవటం. మెదడు అట్టడుగు పొరల్లోంచి తేలుతూ పైకొచ్చింది.

....స్పందన లేకపోవటంలో సామ్యం ఒకటే...!

అతను కదిలాడా...? ఆమె కళ్ళద్దాలు సవరించు

కుని కళ్ళు చిట్లించి చూసింది. అరచేతిని అతని గుండెలమీద ఉంచింది. అతని ప్రాణం ఇంకా ఊగిసలాడుతోంది. కొద్దిగా తెరుచుకుని ఉన్న అతని నోరూ, మూతపడ్డ కనురెప్పలూ, చూస్తున్న ఆమెకి అతనెంత మాత్రం తెలిసిన మనిషిలా లేడు. ఆపరేషన్ చేసి కుట్లతో కలిపిన అతని తల మధ్యభాగం వెనుక నుంచి పడుతున్న ట్యూబ్ లైటుకాంతిలో మెరుస్తోంది. అతడేమవుతాడో, ఆమెకి, డాక్టరు సాయంత్రమే చెప్పేడు. ముందు కొద్దిగా తడబడుతూ ''మీ వాళ్లెవరైనా ఉంటే రమ్మనండి'' అని చెప్పి కాస్సేపు ఏం మాట్లాడకుండా ఉండిపోయి ''నేను వస్తాను'' అని వెళ్ళిపోయేడాయన. కావలసిన వాళ్ళందరూ విదేశాల్లో ఉన్నారు. వాళ్లెవరూ రాలేరు. మిగిలిన ఫ్లాట్లలో ఉన్న వాళ్ళెవరూ కావలసిన వాళ్ళు కాదు. ఆమె పనివాళ్ళని పంపివేసింది.

అతని మంచం పక్క కూర్చుని, అతని తన జీవితకాలంలో సగం కాలం తోడున్న మనిషిని, గమ్యం చేరుకుంటున్న సహ ప్రయాణీకుణ్ణి సాదరంగా వీడ్కోలు పలకడానికి సిద్ధపడుతూ కూర్చుంది.

ప్రేమా...? ప్రస్తుతం కానేకాదు.

కృతజ్ఞతా...? ఖచ్చితంగా కాదు. వివక్ష మీద ఉధృతంగా పోరాటాలు చేసిన నేపథ్యమామెది.సానుభూతి అని కూడా అనుకోలేదామె. ఆధునికోత్తర మానసిక సమాజ వాతావరణంలో, మనిషి మొహం కనిపించని మసిబారిన అద్దం లాంటి వినియోగదారీ సంస్కృతిలో దేనిలోనైనా ఇందులో నాకేం లాభం అని ఆలోచించే కాలంలో జీవిస్తూ ఫైవాటిలో వేటివీ ఆమె అనుకోలేకపోయింది.

జీవితం అంటే నిర్వచనం ఆమెకవసరంలేనిది. జీవితానికి గమ్యం మృత్యువేనని ఆమెకీ, అతనికి అర్థమైపోయి చాలాకాలమే అయ్యింది. ఆమెకి కాస్త దాహం అనిపించింది. ఆమెకీ, అతనికీ ఆకలి చచ్చిపోయి అన్నం బదులు రొట్టెలు తినడం మొదలుపెట్టి చాలాకాలమే అయ్యింది. తినడం కోసమే తినడంగా, రోజూ చెయ్యాల్సిన పనుల్లో భోజనం ఒకటిగా మారిపోయేక, శరీరానికి కావలిసినవి రుచులు కాదనీ, కేలరీలను నిర్ణయం చేసుకున్నాక ఆకలెయ్యటం మానేసింది.

***

ఆమె కదలిక లేకుండా కూర్చుని అల్లిబిల్లి జ్ఞాపకాలను అందంగా అమర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇప్పుడు తన సహచరుడు మరణోన్ముఖుడై ఉన్నప్పుడు, తన మనస్సునామె మృత్యువు వాకిట ముందున్న అతని శరీరం సాక్షిగా తప్పొప్పుల మిట్టపల్లాలకోసం ఆతృతగా, ఆదుర్దాగా తడుముకుంటోంది. కాలేజీ రోజుల్నించీ పోరాట పటిమ ఉన్నదానిగా ముద్ర పడి ఆమెకీ, పోరాటాలే జీవితంగా గడిపిన అతనికీ, సముద్రంలో ఉప్పుకీ, అడవిలో ఉసిరికాయకీ జత కలిసినట్టు జోడి కుదరటమే అప్పట్లో ఓ సంచలనం. ప్రశాంత సముద్రాల మీద ప్రయాణాలు ఆనందాన్నిస్తాయేమో గానీ గుర్తుంచుకోదగిన అనుభవాలనూ, గడ్డు పరిస్థితుల నెదుర్కొనే ఆత్మ స్థైర్యాన్నీ ఇవ్వవు.

కల్లోల సముద్రం మీద ప్రయాణాలే నావికులకి నైపుణ్యాన్నిస్తాయి. ఆ నమ్మకంతోనే మొదట్లో ఇద్దరి జీవితం కల్లోల సముద్రం మీద ప్రయాణంలాగానే సాగింది. దుర్భరమైన లేమినీ, పోరాటాల చేదు ఫలాలనీ ఇద్దరూ సమానంగానే పంచుకున్నారు. గర్భాశయం చిల్లులు పడటం వల్ల ఆమెకి పిల్లలు కలగరని డాక్టర్లు చెప్పినా వాళ్ళేం బాధపడలేదు. ఆ విషయం ఇప్పుడామె మరింత లోతుగా జ్ఞాపకం చేసుకుంది. అతన్లో ఆ బాధ అంతర్లీనంగా ఉండేదా...? గ్రహించగలిగితే ఒక కన్నీటి చుక్కైనా రాలుతుందని ఆశ పడింది. రీమోని పెంచుకున్నపుడూ, రాహుల్ని చేరదీసినపుడూ, అతను ఒక ఉత్సాహ తరంగంలా ఒక ఉద్వేగ మేఘంలాగానే కనిపించేడు. ఎన్ని నిద్రలేని రాత్రులు అతను గడిపేడో తనికి తెలీదు గానీ, తనకి తెలిసి మాత్రం అతను వ్యవస్థ మీద ఆగ్రహంతో అగ్నిపర్వతం లాగా, కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లాగా, జుత్తు రేగిపోయి, వరండాలో వేగంగా పచార్లు చేస్తున్న రాత్రులే...!

ఆమెకి గుండెల్లో కొద్దిగా నొప్పి అనిపించింది. తన చేత్తో అతని తలమీద రాయాలనుకుంది. ఏముందక్కడ? కీమోథెరఫీ ప్రభావం వల్ల వెంట్రుకలేం మిగల్లేదక్కడ. ఒక్క దురలవాటూ లేని కర్తవ్యమే వ్యసనంగా మార్చుకున్న వ్యక్తికి కాన్సర్ అని డాక్టర్లు చెప్పినపుడు తనలో ఏదో హఠాత్తుగా చచ్చిపోయినట్టైపోయి, నిలువెల్లా నీరసం నిండిపోగా, నిలబడలేక కుర్చీలో కూలబడిపోయింది. ఆమె కళ్ళు అప్పుడే కొద్దిగా చెమర్చినట్టు ఆమెకిప్పుడు గుర్తుకొచ్చింది. అప్పుడతడు నిలబడ్డాడు. ఒక అజేయ సైనికుడిలాగా...

***

తామిద్దరి మధ్యా ఎవరూ లేరు. తమ సాంగత్యాన్ని అంగీకరించని వాళ్ళకి తామున్నట్టు తెలుసుకోవాలనీ లేదు. సహజీవనం కొత్తల్లో తామేం చెయ్యాలో అతనొక్కడికే తెలుసు. ఎంతటి శక్తివంతుడిగా ఉండేవాడప్పుడు? ఆమె మరోసారి చలనం బాగా మందగించిపోయిన అతని శరీరం వంక చూసింది. ఎలా ఉండేవాడనీ...! తనెలా మర్చిపోగలదనీ...! ఆరడుగులు పైనే పొడవుండి, అందంగా ఉండే అతను నవ్వుతుంటే, సూదైన ముక్కుకింద, అందమైన పలువరుస తళతళా మెరిసేది. బలమైన చేత్తో అతను, తనను దగ్గరగా తీసుకుంటే, దృఢమైన అతని ఛాతీమీద తలవాల్చి తననుతాను మరిచిపోయేది. ఆమెకి గుండెల్లో బాధ బలంగా కలిగింది. అతను తను అనుకున్నదే అనేవాడు. అన్నదే చేసేవాడు. ఎంత అబ్బురంగా ఉండేది వాగ్ధార... ఎంత నిర్భయంగా ఉండేది అతని పనితీరు. మోగే గంటలాగా... వెలిగే దీపం లాగా... ఉండేవాడు.

ఆమె కళ్ళు కొంచెం చెమర్చేయి. మళ్ళీ ప్రాణంతో ఉన్న అతన్ని చూడలేనేమో అన్న ఆలోచన ఒక ఝంఝామారుతంలా ఆమెని పట్టి కుదిపేసింది. కళ్ళు పెద్దవి చేసి, కళ్ళద్దాలు సరిచేసుకుని, అతని వంక తదేకంగా చూసింది. ఈసారి ఆమె ఆలోచనల్లో మార్పు వచ్చింది. చావు గమ్యమే కావొచ్చు గానీ అదేలాంటి గమ్యమన్న ఆలోచన ఆమె మనసంతా నిండిపోయింది. ఆమె మరింక కూర్చోలేకపోయింది. కుర్చీలోంచి లేచి, అతని దగ్గరగా వెళ్ళి తన చేత్తో మృదువుగా అతని శరీరమంతా నిమిరింది.

ఆమె కళ్ళు నిండారులయ్యేయి. అతన్ని మామూలుగా చెయ్యటం తన చేతుల్లోనేకాదు. ఎవ్వరి చేతుల్లోనూ మరింకలేదన్న సత్యం ఆమె హృదయాన్ని సునామీలా తాకింది. నేత్రాలు నిండుగా వర్షించేయి. మెదడులోని దట్టమైన పొరలన్నీ దిగిపోయినట్టయ్యింది. నాన్న కేకలేస్తే అమ్మ ఒంటరిగా కూర్చుని ఏడవటం గుర్తుకొచ్చింది. అమ్మ చనిపోతున్నప్పుడు అన్నా ఆమె తల వాళ్ళో పెట్టుకుని గుండెలవిసేలా రోదించటం తటాలున మెదడులో మెరిసిపోయింది. ఆమెకి నిరంతర సత్యమేదో పూర్తిగ అర్థమైనట్లైంది. ఆమె మంచం ముందు మోకరిల్లింది. ఆమె ఆవేదన పూర్తిగా తొలగిపోయింది.

ఒక వెయ్యి నక్షత్రాల వెలుగు ఆమె కన్నుల్లో ప్రతిఫలించింది. ఒక లక్ష పూల సుగంధం ఆమె హృదయం నిండా నిండిపోయింది.

అతనింకా మరణించలేదు...!

ఆమె మరణించింది.

*

రచయిత సెల్ నెం: 94907 91568

